క్లుప్తంగా

భూ రీసర్వే లోపాలు సరి చేసుకోవాలి

రోలుగుంట: తొలి విడత భూ రీసర్వేలో లోపాలు తలెత్తితే రైతులు మరొకసారి సర్వే చేయించుకుని సరి చేసుకోవాలని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు, రోలుగుంట గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో ఆటోలో విస్తృత ప్రచారం చేశారు. తొలి విడత సర్వే జరిగిన వెదుళ్లవలసలో కొంత మందికి లోపాలు ఉన్నాయన్నారు. ఆ రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్‌పుస్తకం అందజేసి రెండు రోజుల్లో సరి చేసుకోవాలని తెలిపారు.

100 రోజుల పని దినాలు పూర్తి చేసుకోవాలి

కె.కోటపాడు : మండలంలో 32 పంచాయతీల్లో గల 9100 మంది ఉపాధి వేతనదారులు పనులకు హాజరు కావాలని ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. మండలంలో శృంగవరం, మర్రివలస గ్రామాల్లో మంగళవారం ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. రోజువారి గరిష్ట వేతనం రూ.257 పొందేలా పనులు చేయాలని సూచించారు. ఏపీవో వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

తైక్వాండో శిక్షణ శిబిరాలు ప్రారంభం



చోడవరం గవర్నమెంట్ హైస్కూల్లో తైక్వాండో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

చోడవరం: తైక్వాండో వేసవి శిక్షణ శిబిరాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బాలికల ఆత్మరక్షణకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తైక్వాండో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 800 ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి, ఇంటర్ విద్యార్థినులకు ఈ శిబిరాల్లో శిక్షణ ఇస్తారు. చోడవరం గవర్నమెంట్ హైస్కూల్, లక్కవరం, గోవాడ హైస్కూళ్లలో ఈ శిబిరాలను ప్రారంభించారు. రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్, సమగ్ర శిక్ష అభియాన్‌లో భాగంగా సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ క్యాంప్‌లో ఏప్రిల్ 24 వరకు బాలికలకు ఈ శిక్షణ ఇస్తారు.

పశు దాణాను సద్వినియోగం చేసుకోవాలి



గుడ్డిపలో రైతులకు పశుదాణా పంపిణీ చేస్తున్న అధికారులు

రావికమతం: ప్రభుత్వం 60 శాతం సబ్సిడీతో పంపిణీ చేసే టీఎంఆర్ పశుదాణాను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని తట్టబంద, కొత్తకోట పశువైద్యులు సూకేశ్వరరావు, బాలతేజ తెలిపారు. గుడ్డిపలో రైతులకు పశుదాణాను మంగళవారం పంపిణీ చేశారు. పోషకాలు కలిగిన దాణా పొందేందుకు రైతులు సచివాలయాల్లో గల వెటర్నరీ సహాయకులచే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలన్నారు.

నీరు వృథా.. రైతుల వ్యథ

- నిత్యం లీకేజీ ద్వారా పోతున్న తాండవ జలరాశి
- ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా మరమ్మతులు చేపట్టని అధికారులు
- క్రమేపీ తగ్గుతున్న నీటి మట్టం.. అన్నదాతల ఆందోళన




ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసినట్లు భ్రమ కల్పిస్తూ పెద్ద ఎత్తున కాలువలో ప్రవహిస్తున్న నీరు

నాతవరం: తాండవ రిజర్వాయర్ ప్రధాన గేట్ల లీకేజీ కారణంగా సాగునీరు వృథాగా పోతోంది. ఉమ్మడి జిల్లాల్లోనే ఈ రిజర్వాయర్ ఏకైక మేజర్ ప్రాజెక్టుగా ప్రత్యేకత సంతరించుకుంది. తాండవ నీటి ఆధారంగా ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో అనకాపల్లి, కాకినాడ జిల్లాల పరిధిలో 52 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. అయితే తాండవ ప్రధాన గేట్ల లీకేజీ వల్ల గత కొన్నేళ్లుగా సాగునీరు కళ్ల ముందే వృథాగా పోతున్న విషయం రైతులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గత ఏడాది ప్రభుత్వం రూ. 7 లక్షల 50 వేలు మంజూరు చేసింది. అయితే ఆ సమయంలో తాండవ ప్రాజెక్టులో నీటిమట్టం ప్రమాదస్థాయిలో ఉండటంతో పాటు ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాల్సిన కారణంగా మరమ్మతు పనులకు వీలు కుదరలేదు. ఆయకట్టుకు గత ఏడాది డిసెంబర్ 5వ తేదీన నీరు నిలుపుదల చేసే సమయానికి తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం 373.5 అడుగులు ఉండేది. నిత్యం లీకేజీ ద్వారా నీరు పోతుండడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో మంగళవారం సాయంత్రానికి 371.0 అడుగులకు తగ్గిపోయింది. ఈ రిజర్వాయర్ డేడ్ స్టోరేజీ నీటి మట్టం 345 అడుగులు కాగా ప్రమాదస్థాయి నీటి మట్టం 380.0 అడుగులుగా పరిగణిస్తారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి నీటిని నిలుపుదల చేసినా ప్రధాన గేట్ల నుంచి లీకేజీ నీరు పంట కాలువల్లోకి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ దృశ్యాన్ని కొత్తగా ఎవరైనా చూస్తే తాండవ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తున్నారేమో అనుకుంటారు. ఆ స్థాయిలో నీరు వృథా అవుతూ ప్రాజెక్టులోని నీటిమట్టం క్రమేపీ తగ్గిపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగుతూ పోతే వచ్చే ఖరీఫ్ నాటికి ఆయకట్టు భూములకు చుక్క నీరు నిల్వ ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలువుల్లో కానరాని పూడికతీత పనులు

తాండవ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు నీరు ప్రవహించే పంట కాలువల్లో ఫిబ్రవరి నుండి పూడిక తీత పనులు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది అటువంటి దాఖలాలు కనిపించడంలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని రైతులంటున్నారు. వారి వ్యవహారశైలి కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్ ఆరోపిస్తున్నారు. ఖరీఫ్ పంటకు నీరు నిలుపుదల చేశాక కాలువలను పరిశీలించి రైతుల సూచనల మేరకు ఆటంకాలు తొలగించి నీరు సాఫీగా ప్రవహించేలా చూడాలని ఆయన చెబుతున్నారు.

పరిశీలించి.. లీకేజీ అరికడతాం



తాండవ రిజర్వాయర్‌ను స్వయంగా పరిశీలించి గేట్లకు మరమ్మతులు చేస్తాం. నీటి సరఫరా విషయమై ఆయకట్టుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యుద్ధప్రతిపాదికన చర్యలు చేపడతాం. రైతులు ఆందోళన చెందవద్దు.

సూర్యకుమార్,
ఉమ్మడి జిల్లాల ఇరిగేషన్ ఎస్ఈ

మహిళా 'మణులు'

ఆపన్నులకు అండగా నిలవటంలోనూ.. రాజకీయాల్లో సమర్థవంతమైన నాయకురాలిగా దక్షత చూపటంలోనూ ఆమె శైలే వేరు. తాత, తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని రికార్డు మెజారిటీతో విజయం సాధించి రాజకీయాల్లోనూ సత్తా చాటారు. కె.కోటపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ. అలాగే నాతవరంలోని ములగపూడికి చెందిన ఇట్టంశెట్టి అక్కయ్యమ్మ సేవలతో పలువురిని ఆదుకుంటున్నారు.





హెచ్ఎం స్వర్ణలతను సత్కరిస్తున్న గ్రామస్తులు



ఆసుపత్రిలో బాలింత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న అనురాధ

- పలు రంగాల్లో ప్రతిభ చాటుతున్న కె.కోటపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ
- పేదల సేవల్లో తరిస్తున్న ఇట్టంశెట్టి అక్కయ్యమ్మ
- మహిళా దినోత్సవం ప్రత్యేకం

కె.కోటపాడు : బూడి వెంకునాయుడు మనవరాలు, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనురాధ బహుముఖ ప్రజ్ఞతో సెహభాష్ అనిపించుకుంటున్నారు. గతంలో కె.కోటపాడు మండలంలో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో ఎప్పుడూ ఎవరికీ రాని విధంగా 16,424 ఓట్ల మెజారిటీతో నెగ్గి రికార్డు సృష్టించారు.

- జిల్లా పరిషత్ స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.
- మండలానికి జిల్లా పరిషత్ నుండి ఎక్కువగా నిధులు మంజూరు చేయించి.. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి చేయించారు.
- మంచినీటి బోర్లు వేయించి ప్రజల దాహార్తి తీర్చారు.
- కె.కోటపాడు-కింతాడ, దాలివలస-సింగన్నదొర పాలెం, మేడిచర్ల-ఎ.కోడూరు ప్రాంతాల్లో తారు రోడ్లు వేయించారు.
- రైతుల సమస్యలు పరిష్కరించారు. పనుల్లో గాయపడిన వారిని, అగ్నిప్రమాదాల్లో సర్వం కోల్పోయిన వారిని ఆదుకున్నారు.
- ప్లాస్టిక్ వినియోగం మానాలని ఎ.కోడూరు, సూర్రెడ్డిపాలెం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.
- రైతు బిడ్డగా సొంత పొలంలో వ్యవసాయ పనులు నిర్వహిస్తుంటారు.
- మరో వైపు ఎన్ని పనులున్నా తల్లిగా తన పిల్లలను చక్కగా చదివిస్తూ తోటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.
- తన ప్రజ్ఞాపాటవాలతో సీఎం జగన్ ఆదేశాలు అందుకుని అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులయ్యారు.

సేవలతో మన్నన

నాతవరం: నాతవరం మండలం ములగపూడి గ్రామానికి చెందిన ఇట్టంశెట్టి అక్కయ్యమ్మ అయిదేళ్లుగా పేదలకు సేవలందిస్తూ మన్ననలు పొందుతున్నారు. అమ్మవాసవీ స్వచ్ఛంద సంస్థ స్థాపించి మండలవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. కరోనా సమయంలో మండల కేంద్రంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి పేదలకు రుచికరమైన భోజనాలు పెట్టారు. 64 ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు సామగ్రి, దుస్తులు పంపిణీ చేస్తున్నారు. ప్రతిఏటా 31 పంచాయతీల్లో దారిద్ర్యరేఖకు దిగువనున్న వృద్ధులు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేస్తున్నారు. కొండలపై ఉన్న గిరిజన గ్రామాల్లో ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తున్నారు. ఆమె సేవలకు గాను మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు గత ఏడాది విశాఖలో ఘనంగా సత్కరించారు.



మిజోరాం గవర్నర్ హరిబాబుతో అక్కయ్యమ్మ (ఫైల్)



కళావతికి కేక్ తినిపిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

ఎ. కొత్తపల్లి జెడ్పీహెచ్‌లో..

దేవరాపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఎ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వై. స్వర్ణలత అన్నారు. స్థానిక హైస్కూల్లో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో దేముడమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ సురేఖ, ఏఎన్ఎం దివ్య, మహిళా సంరక్షణ కార్యదర్శి విజయ్, పోస్ట్‌వుమెన్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో..

మాడుగుల: మహిళల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. మంగళవారం సర్పంచ్ ఎడ్ల కళావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు. ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వివరించారు. ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, షేక్ ఉన్నీషా, వార్డు మెంబర్లు శీలామంతుల జ్యోతి, బొడ్డేట లీలావతి, అచ్చుతం, ఎంపీపీ వేమవరపు రామధర్మజ తదితరులు పాల్గొన్నారు.

గునుపూడి పీహెచ్‌సీలో..

నాతవరం: సమాజంలో మహిళల పాత్ర కీలకమని గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.పద్మప్రియ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి మహిళా చదువుకున్నప్పుడే సమాజంలో గౌరవం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నానాజీ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు

ఉత్తమ విద్యార్థుల తల్లులకు సత్కారం

చోడవరం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ సారథ్యంలో జరిగిన వేడుకల్లో భాగంగా విద్యలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థుల తల్లులను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన భారతీయ సంప్రదాయమన్నారు. మహిళా సాధికారత కో ఆర్డినేటర్ లక్ష్మీమంగమ్మ మాట్లాడుతూ కుటుంబ నిర్వహణలో మహిళల పాత్ర ఎనలేనిదన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో డి.మాల్యాద్రి, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినులు లక్ష్మీపార్వతి, మౌనిక మహిళా సాధికారత గురించి ప్రసంగించారు.

సీతంరాజుకు మద్దతుగా ప్రచారం



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్



జి. అగ్రహారంలో ప్రచారం చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి



బుచ్చింపేటలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

కె.కోటపాడు : వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. కె.కోటపాడు మండలంలో ఎ.కోడూరు, దాలివలస, మర్రివలస, సూదివలస, ఆర్లి, చౌడువాడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు పాల్గొన్నారు.

జి. అగ్రహారంలో..

మాడుగుల రూరల్: సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం జి. అగ్రహారంలో ప్రచారం చేపట్టారు. సీఎం ఆశీస్సులతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమములో స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్లె మాధవి పాల్గొన్నారు.

కింతలిలో..

మాడుగుల రూరల్: సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా మంగళవారం కింతలిలో పార్టీ నాయకులు జామి చిన్న ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. అవురువాడ పంచాయితీ శివారు గ్రామాల్లో ఎంపీటీసీ సభ్యులు కృష్ణందొర, బన్నీ తదితరుల సారథ్యంలో ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం పరిధిలో..

మాకవరపాలెం: సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని మంగళవారం మండలంలోని తామరం, తూటిపాల, బూరుగుపాలెం, తాడపాల, పాపయ్యపాలెం, జీ.కోడూరు, మాకవరపాలెం తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, నాయకులు గొంతిన హరిబాబు, భీమిరెడ్డి గోవింద, యర్రాలోవ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట పరిధిలో..

రోలుగుంట: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజును గెలిపించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మంగళవారం బుచ్చింపేట శరభవరం, రోలుగుంట, జె.నాయుడుపాలెం, కొమరవోలు తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీ రమణమ్మ, కొప్పల వెలమ స్టేట్ డైరెక్టర్ టీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు కోరారు. మంగళవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంపీడీవో కార్యాలయం వంటి చోట్ల ప్రచారం చేశారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కర రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబు రావు, యువజన విభాగం అధ్యక్షుడు కర్రి సూరినాయుడు కోరారు. మండలంలోని బోయిలకింతాడ, తిమిరాం, వాకపల్లి, వెంకటరాజుపురం, తెనుగుపూడి, గరిశింగి గ్రామాల్లో మంగళవారం విస్తృత ప్రచారం చేశారు.

వేసవిలో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

కె.కోటపాడు : వేసవిలో వృద్ధులు, చిన్నారులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. పాచిలవానిపాలెంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. 139 మందికి ఓపీ ద్వారా వైద్యం అందించారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వైద్యం కోసం రాలేని 19 మంది ఇళ్లకు వెళ్ళి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్ఎం ఉషా, రమణ పాల్గొన్నారు.

శంకరంలో ఫ్యామిలీ ఫీజిషియన్ కార్యక్రమం..

మాడుగుల రూరల్: శంకరం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫీజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. కేజేపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బొడ్డేడ రవితేజ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 115 మంది రోగులను, పాఠశాల, అంగన్‌వాడీ పిల్లలను పరీక్షించారు. ఆరోగ్య పర్యవేక్షకుడు వెంకట్రావు, సహాయకుడు నీలాంబరంతో పాటు ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

చమ్మచింతలో..

నాతవరం: ప్రభుత్వం చక్కటి ఆశయంతో ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ పేదలకు వరం అని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. చమ్మచింత గ్రామంలో మంగళవారం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతను నివారించవచ్చన్నారు. గర్భిణులు ప్రసవాల కోసం పీహెచ్‌సీలకు రావాలన్నారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్ పాల్గొన్నారు.

న్యాయం కోరుతూ ఆందోళన

నాతవరం: పాయకరావుపేట మండలం పీఎల్‌పురంలో నాగేంద్ర హత్యకు కారకులైన దోషులను వెంటనే అరెస్టు చేయాలని పోలీసు స్టేషన్ ఎదుట దళిత సంఘాల జేఏసీ నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు దళితులను చిన్న చూపు చూస్తూ దోషులను పట్టుకోవడంలో జాప్యం చేస్తే నర్సీపట్నం డివిజన్‌లో గల అన్ని పోలీసు స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేపడతామన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్సు అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు మార్తి అప్పలరాజు, నాతవరం మాజీ ఎంపీపీ నేతల విజయకుమార్, గొలుగొండ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చిట్ల చలపతి, జేఏసీ జిల్లా నాయకుడు చెక్కా జోగిరాజు పాల్గొన్నారు.

బాల సదనం ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

నర్సీపట్నం: బీసీ కాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలసదనం వసతిగృహాన్ని అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి మరుగుదొడ్లను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిత్యావసర సరకులను తనిఖీ చేశారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరీక్షించారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని బాలసదనం వార్డెన్ కు సూచించారు.

సేవాదళ్ ఇన్‌చార్జికి ఎమ్మెల్యే అభినందన

నర్సీపట్నం: మూడు జిల్లాల సేవాదళ్ ఇన్‌చార్జిగా నియమితులైన సేనాపతి రామ్మూర్తిని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అభినందించారు. పార్టీలో కష్టపడి పని చేస్తే సముచితస్థానం లభిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. నర్సీపట్నానికి చెందిన రామ్మూర్తి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ సేవాదళ్ విభాగాలకు ఇన్‌చార్జిగా నియమితులు అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ, వీరమాచినేని జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పైడిపాల ఎంపీటీసీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు

మాకవరపాలెం: మండలంలోని పైడిపాల ఎంపీటీసీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. పైడిపాల ఎంపీటీసీ రుత్తల రమణమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నిక నిర్వహణకు సంబంధించి పోలింగ్ బూత్‌ల ఏర్పాటుపై అభ్యంతరాలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి తీర్థం

చోడవరం రూరల్: మండలంలోని లక్ష్మీపురంలో అభయాంజనేయస్వామి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, మధ్యాహ్నం ఎడ్ల బండ్ల పరుగు ప్రదర్శన, గుర్రపు స్వారీ వంటివి ఉర్రూతలూగించాయి. ఎడ్ల ప్రదర్శనలో విజేత బండ్ల ఎడ్ల జతల యజమానులకు వరుసగా 10,8,6,4, రెండు వేల నగదును, గుర్రపు స్వారీలో విజేత రౌతులకు వరుసగా 8,6,4, రెండు వేల నగదును అందచేశారు.

ఘనంగా అమ్మవారి పండగ

మాడుగుల రూరల్: మండలంలో జి. అగ్రహారంలో పోల్లేపల్లిమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నందారపు మంగమ్మ, నందారపు పానాపతి, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్లె మాధవి, నాయుడు, మాజీ సర్పంచ్ నందారపు సత్యనారాయణ ఆయనను సన్మానించారు. పండగ సందర్భంగా ఎడ్ల పోటీలు, కోలాటం నిర్వహించారు. స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వీవీ అగ్రహారం పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ చెల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌తో ఓటర్ కార్డు అనుసంధానం తప్పనిసరి

దేవరాపల్లి: ఈ నెల 15లోగా ఓటరు గుర్తింపు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి డి. అనిత అన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక తహసీల్దార్ ఎం. లక్ష్మి అధ్యక్షతన మంగళవారం బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నిర్ణీత గడువు లోగా ఎట్టి పరిస్థితుల్లోను ఓటరు గుర్తింపు నెంబర్‌కు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ డి. అరుణ్‌చంద్ర, ఆర్ఐ సతీష్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



కుంచుగుమలలో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శిరీషారాణి

రోలుగుంట: జగనన్న సత్సంకల్పంలో భాగంగా పారిశుధ్య పనులు మెరుగుతో పాటు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయితీ అధికారి శిరీషారాణి కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల కార్యాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. తొలుత మండల స్థాయిలో పంచాయితీ కార్యదర్శులతో ఈవోపీఆర్డీవో మల్లికార్జునబాబు సమావేశం ఏర్పాటు చేశారు. పాల్గొన్న డీపీవో మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా జరిగిన పనులపై ఆరా తీశారు. ఈ వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కంచుగుమల, రోలుగుంట, కొవ్వూరు, నిండుగొండ గ్రామాల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు.